www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 17 ఫిబ్రవరి 2025
5
తిరుపతి



నేడు డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో 17వ తేది సోమవారం ఉదయం 9:30 గంటల నుండి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం, అదేవిధంగా అర్జీలు, పిర్యాదులు ఇచ్చే వారి కోసం ఉదయం 10:30 నుండి "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమం జరుగుతుందన్నారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208కి కాల్ చేసి మాట్లాడవచ్చని తెలిపారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేసే ఫోన్ నంబర్లను పొందుపరచాలని తెలిపారు.

మినిమం టైంస్కేల్ సాధనకు ఉద్యమిద్దాం : ఏపియన్ పిలుపు

- ప్రభుత్వం స్పందించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తాం : జేపీసీ



సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర జేపీసీ చైర్మన్ ఏవి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - క్యాంపస్ : తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రభుత్వ కాంటాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులు అందరికీ మినిమం టైం స్కేల్ ఇస్తానని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత జీవో నెంబర్ రెండు పేరుతో ఆర్థిక శాఖ అనుమతి ఉన్న కొంతమందికి ఉద్యోగులకు మాత్రమే వర్తింప చేసింది. దీనిని తక్షణమే సవరించి అందరి ఉద్యోగస్తులకు వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర జేపీసీ చైర్మన్ ఏవి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. యశోద నగర్‌లో ఉన్న వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు తిరుపతి జిల్లా జేపీసీ చైర్మన్ గండికోట నాగ వెంకటేశ్ అధ్యక్షతవహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా కాంటాక్ట్, అవుట్సోర్సింగ్ జేపీసీ చైర్మన్ ఏవి నాగేశ్వరరావు విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నంబర్ 2 ను సవరించి అందరికీ ఎంటిఎస్ అమలు చెయ్యాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి అందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల పట్ల కక్షపూరితమైన వైఖరి వీడాలన్నారు. గత 15 సంవత్సరాల నుంచి వేతనం పెంపులో ఎలాంటి మార్పు లేదని, ధరలన్నీ విపరీతంగా పెరిగిపోయినా, ఉద్యోగస్తులు జీతాలు మాత్రం పెరగడం లేదన్నారు.

> **లైంగిక నిరోధక వేధింపుల కమిటీలను అమలు చేయాలి**
>
> ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పని చేసే ప్రదేశాలలో లైంగిక వేధింపులు నిరోధక కమిటీ ఉండాలని చెప్పినప్పటికీ ఏ ఒక్క సంస్థ అమలు చేయడం లేదు. పని ప్రదేశాలలో ఇప్పటికీ అనేకచోట్ల లైంగిక వేధింపులు జరుగుతూనే ఉన్నాయి. జీతం పెంచమని అడిగితే పని మానేమని చెప్పడం దుర్మార్గం. ఈ కొత్త పద్ధతిని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకొస్తోందనే మా ఆవేదన.
>
> - శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి

కాంటాక్ట్ వర్కర్స్ జీవితాలలో మార్పు రావాలంటే పోరాటం ఏకైక మార్గం అని పిలుపునిచ్చారు. ఆప్కాస్ రద్దు చేయడం అంటే కాంట్రాక్టర్లకు దోచిపెట్టడమేనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడున్నర లక్షలకు పైచిలుకు ఉద్యోగులకు నోట్లో మట్టి కొట్టడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఆప్కాస్ సంస్థ వలన అనేక రకాల ప్రయోజనాలున్నాయని, ఆప్కాస్ రద్దయిపోతే ఉద్యోగుల భద్రతలో కరువు ఏర్పడుతుందన్నారు.

సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్. జయచంద్ర, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.చిన్నబాబు, జేపీసీ చైర్మన్ గండికోట నాగవెంకటేష్‌లు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ పార్ట్ టైం, ఎన్.ఎం.ఆర్, కంటింజెంట్, డైలీ వేజెస్, గెస్ట్, సకల తాత్కాలిక ఉద్యోగులందరూ మినిమం టైమ్ స్కేల్ జీవో అమలు కోసం ఉద్యోగ భద్రత రెగ్యులరైజషన్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈ జిల్లా సదస్సులో 24 డిపార్ట్మెంట్లకు సంబంధించినటువంటి ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు, వెటర్నరీ ఆప్కాస్ నాయకులు గంగయ్య, బాబు, ఎస్వియు నాయకులు రాజేంద్ర, గణేష్, మురగయ్య, సుమతి, అగ్రికల్చర్ వర్కర్స్ నాయకులు వరలక్ష్మి, మునిలక్ష్మి, సుబ్బరత్నమ్మ, చంద్రమ్మ, అనురాధ, నేషనల్ హెల్త్ మిషన్ నాయకులు ఈ. లోకేష్ బాబు, ఎస్. మొహిద్దిన్, జి నారాయణమ్మ, సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘం నాయకులు మునికృష్ణ, ప్రదీప్ కుమార్, మహదేవయ్య, 104 ఉద్యోగ సంఘం నాయకులు అమర్నాథ్, బత్తిరెడ్డి, భువనేశ్వరి, 108 ఉద్యోగ సంఘ నాయకులు మహేష్, రుయా ఆప్కాస్ నాయకులు నర్సింహులు, నిర్మల ఉష, రైల్వే కాంట్రాక్ట్ వర్కర్ నాయకురాలు రేఖ, జూ పార్క్ వర్కర్స్ నాయకులు ఈశ్వర్ రెడ్డి, విద్యుత్ కాంట్రాక్ట్ వర్క్ యూనియన్ నాయకులు సుదర్శన్ రెడ్డి, టి. కుమార్, రవికుమార్, తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

> **మినిమం ఆఫ్ టైమ్ స్కేల్ అమలు చేయాలి**
>
> మాట్లాడుతూ జీవో నంబర్ 2ను సవరించి, తిరుపతి జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థలు, యూనివర్సిటీలు, కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో నడుస్తున్న పథకాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ మినిమం ఆఫ్ టైమ్ స్కేల్ అమలు చేయాలి. సమాన వేతనం కల్పించడం ద్వారా ఉద్యోగుల జీవితాలను మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నాం.
>
> - సిఐటియు తిరుపతి జిల్లా ప్రధానకార్యదర్శి కందారపు మురళి

మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నెల్లూరు జిల్లా పర్యటన నిమిత్తం ఆదివారం ఉదయం10.54 గంటలకు రేణిగుంట విమానాశ్రయంకు చేరుకున్న రాష్ట్ర విద్యాశాఖ, ఐటి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఆర్టీజీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం లభించింది. తిరుపతి, చంద్రగిరి, నగరి, వెంటగిరి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, పూతలపట్టు, సర్వేపల్లి శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్ నాయుడు, కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, బొజ్జల సుదీర్ రెడ్డి, మురళీ మోహన్, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, చిత్తూరు పార్ల మెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, మాజీ ఎంఎల్ఏ సుగుణమ్మ, అడిషనల్ ఎస్పీ రవి మనోహర చారి, తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, నరసింహ యాదవ్, కాళహస్తి ఆర్డిఓ భానుప్రకాష్ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి కెవిఎన్ కుమార్, రేణిగుంట తాసిల్దార్ సురేష్ బాబు, ప్రజాప్రతినిధులు లోకేష్‌కు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రేణిగుంట విమానాశ్రయం నుండి నెల్లూరుకి రోడ్డు మార్గాన బయలు దేరి వెళ్ళారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తిలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్‌కు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, ఈవో బాపిరెడ్డి ఆహ్వానం పలికారు. మంత్రి లోకేష్ ఆదివారం నెల్లూరు పర్యటన నిమిత్తం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకోగా ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను, ముక్కంటి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణకు సూచన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి ఎయిర్ పోర్ట్‌కి విచ్చేసిన మంత్రి వర్యులు నారా లోకేష్‌కు, తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఆర్.సి.మునికృష్ణ శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా లోకేష్ ప్రజలకు అందుబాటులో ఉడాలని, కూటమి నాయకులను కలుపుకొని తిరుపతిలో పార్టీని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పులిగోరు మురళి కృష్ణా రెడ్డి, బి.జి.కృష్ణా యాదవ్, కార్పొరేటర్ అన్నా అనిత, శంకర్ యాదవ్ పాల్గొన్నారు.


ఆలోచించండి.. ఆచరణలో పెట్టండి





ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : నేటి మేధావి యువత తమ ఆలోచనలకు పదును పెట్టి వాటిని ఆచరణలో పెడితే సమాజానికి దోహదపడే ఎన్నెన్నో కొత్త కొత్త ఆవిష్కరణలు పురుడు పోసుకుంటాయని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ సూచించారు. పట్టుదలకు తోడు మానసిక పరిపక్వత సాధిస్తే ప్రపంచం గర్వించే మైలురాళ్లను అధిగమిస్తారన్నారు. స్థానిక తిరుపతి ఐఐటీలో టెడ్-ఎక్స్ ఈవెంట్‌ను ఆదివారం నిర్వహించారు. ఉన్నత శిఖరాలు అధిరోహించిన పలువురు టెడ్-ఎక్స్ వేదికగా తమ అనుభవాలను ఐఐటి విద్యార్థులకు విశదీకరించి చెప్పారు. మోటారు బైకింగ్‌లో ప్రపంచ రికార్డు సాధించిన ఇరానీ మగువ మారల్ యాజర్లూ యువతకు దిశా నిర్దేశం చేశారు. ఫిజిషియన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నేషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ ధృవ్ చౌహాన్, ఈఎస్డీఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు పీయూష్ సోమాని తదితరులు పాల్గొన్నారు.

మేత భూమిని అలాగే ఉంచండి



ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి ముద్దుముడి దళితవాడ ప్రజల వినతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తరాలు మారినా పాడి పరిశ్రమపైనే ఆధారడి జీవిస్తున్న తమకు మేత భూమిని అలాగే ఉంచాలని శ్రీకాళహస్తి మండలం, ముద్దుముడి దళితవాడ ప్రజలు శ్రీకాళహస్తి ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ముద్దుమూడి గ్రామస్తులు ఆదివారం ఎమ్మెల్యేని కలిశారు. సర్వే నెంబర్ 51/3లో సుమారు పది ఎకరాల భూమిని ఎన్నో ఏళ్లుగా మేత భూమిగా వినియోగించుకున్నట్లు తెలిపారు. అయితే గత ప్రభుత్వ హయాంలో ఈ భూమిలో ఐదెకరాలను బెటాలియన్ శిబిరంకు కేటాయించారని తెలియజేశారు. ఆ పట్టాను రద్దుచేసి మేద భూమిని యధాతథంగా ఉంచాలని కోరారు.

నగర సుందరీకరణ, పరిశుభ్రతే లక్ష్యం : కమిషనర్ మౌర్య



ఇళ్లపై వేసిన చిత్రాలను చూపుతున్న కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరాన్ని సుందరంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. నగరంలోని స్కావెంజర్స్ కాలనీలో జరుగుతున్న పారిశుద్ధ్య, సుందరీకరణ పనులను ఆదివారం మధ్యాహ్నం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డుల తనిఖీల్లో భాగంగా స్కావెంజర్స్ కాలనీని పరిశీలిస్తున్నామన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా అన్ని ఇండ్లపై అందమైన చిత్రాలని వేయిస్తున్నామని అన్నారు. డ్రెయినేజీ కాలువలు బాగుచేయాలని, త్రాగునీరు సకాలంలో సరఫరా చేయాలని ఆదేశించామన్నారు. స్కావెంజర్స్ కాలనీని అందమైన కాలనీగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రజలు సహకరిస్తే స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఉత్తమ ఫలితాలు సాధిస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంట డి.ఈ.రాజులు ఉన్నారు.

నేడు ముఖ్యమంత్రి తిరుపతికి రాక



భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్ పి హర్షవర్ధన్ రాజు, జేసీ శుభం బన్సల్, కమిషనర్ ఎన్.మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సీఎం చంద్రబాబు టెంపుల్ కనెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ 2025 కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్లలో ఎలాంటి అలసత్వం ఉండరాదని జెసి శుభం బన్సల్, ఎస్పి హర్ష వర్ధన్ రాజు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ హేమంత్, ఏఎస్పీలు శ్రీని వాస రావు, రవి మనోహారాచారి, ఆర్డీవో శ్రీకాళహస్తి భాను ప్రకాష్ రెడ్డి, డిఎంహెచ్ఓ బాలాజీ నాయక్, రుయా సూపరింటెండెంట్ రవి ప్రభు తదితరులు పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ దేవాలయాల సదస్సును ప్రారంభించనున్న సీఎం



సమావేశంలో మాట్లాడుతున్న మహారాష్ట్ర ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ ప్రసాద్ లాడ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆలయాల నిర్వహణకు నూతన విధానపరమైన చర్యలు, దేవాలయాల ప్రతిష్ట వంటి అంశాలతో మంగళం తిరుపతి-కరకంబాడి మార్గంలోని ఆశాలత కన్వెన్షన్ సెంటర్ వేదికగా మూడు రోజులపాటు జరిగే అంతర్జాతీయ దేవాలయాల సదస్సు, ఆలయాల నమూనాల ప్రదర్శన కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను మహారాష్ట్ర ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ ప్రసాద్ లాడ్ ఆదివారం విలేకరుల సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మం, ధార్మిక కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అంత్యోదయ ప్రతిష్ట సంస్థ కృషి చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా 58 దేశాల్లోని 1581 ఆలయాలకు సంబంధించిన ప్రతినిధులు ఈ మూడు రోజులు జరిగే సదస్సుకు హాజరవుతారన్నారు. 111 మంది ప్రముఖ వక్తలు, 60 కి పైగా స్టాల్స్, 15 వర్క్ షాప్ లను ఏర్పాటు చేశామన్నారు. ఆలయాల నిర్వహణ, వినూత్న విధానాలు, ఉత్తమ పద్ధతులను అన్వేషించడం, స్థిరమైన పర్యావరణ వ్యవస్థలను నెలకొల్పటం, డిజిటలైజేషన్ ఆధారిత వ్యవస్థలను పెంపొందించడంపై ఈ సదస్సు ద్వారా ప్రజలకు వివరిస్తామన్నారు. దేశ అభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వికసిత్తుభారత్ 2047 లక్ష్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు మహారాష్ట్ర, గోవా ముఖ్యమంత్రులు హాజరవుతున్నారన్నారు.


వైభవంగా పశువుల పండగ



పశువులకు కట్టే చెక్క ప్రకరణ విశేషంగా అలంకరించి ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) పట్టుకో..... పట్టుకో..... దమ్ముంటే నా కోడె గిత్తలను పట్టుకో అంటూ.. తిరుపతి జిల్లా, చంద్రగిరిలో ఆదివారం పరుష పందేలు అంగరంగ వైభవంగా జరిగాయి. చంద్రగిరిలోని మిట్ట గంగమ్మ దేవాలయ సమీపంలో నిర్వహించిన జల్లికట్టులో రంకేసిన కోడె గిత్తలతో, యువకుల జోరుతో జల్లికట్టు జోరుగా సాగింది. కోడెగిత్తల కొమ్ములకు చెక్క పలకలు, నూతన వస్త్రాలు, పారితోషకంగా నగదును కట్టి బరిలోకి దింపారు. కోడె గిత్తలను డబ్బులు కొడుతూ బెదిరించి పరుగులు చేయించారు. అప్పటికే వివిధ ప్రాంతాల నుండి వచ్చిన యువత గుంపులు గుంపులుగా చేరి పశువులకు కట్టిన పలకలను చేజికిచ్చేందుకు పోటీపడ్డారు. ఈ క్రమంలో జరిగిన చెదురు మదుర సంఘటనలో 20మంది యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పరుష పందాలను తిలకించేందుకు విచ్చేసిన జనాలతో చంద్రగిరి జనసంద్రమైంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

చంద్రగిరి జల్లికట్టుకు అతిథిగా మంచు మనోజ్



చంద్రగిరిలో ఆదివారం నిర్వహించిన పశువుల పండుగకు నటుడు మంచు మనోజ్ హాజరయ్యారు. మంచు మనోజ్ అభిమానులు, జల్లికట్టు ప్రియులు, ఆయనకు స్వాగతం పలికారు.

వెటర్నరీ విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ, తిరుపతి విద్యార్థులకు ఇతర వైద్య కోర్సుల విద్యార్థులతో సమానంగా బివిఎస్సి, ఏహెచ్, ఎంవిఎస్సి, పిహెచ్డి విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలని స్థానిక తిరుపతి నగరంలో ఉన్నటువంటి గంధమనేని శివయ్య భవన్‌లో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వ విద్యాలయం పరిధిలోని తిరుపతి, గన్నవరం, ప్రొద్దుటూరు, గరివిడి, తిరుపతి డైరీ టెక్నాలజీ విద్యార్థులు ఈనెల మూడవ తేదీ నుండి తమకు ప్రభుత్వం ఇచ్చే స్టైఫండ్ పెంచాలని క్లాసులు బహిష్కరించి శాంతియుత ఆందోళన చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2013 నుండి వెటర్నరీ విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే స్టైఫండ్ కేవలం 7 వేలు, పీజీ విద్యార్థులకు నెలకు 9 వేలు, పిహెచ్‌డి విద్యార్థులకు 10 వేలు ఇస్తున్నారని తెలిపారు. మెడికల్ విద్యార్థులకు నెలకు 25 వేలకు పైగా చెల్లిస్తున్నారన్నారు. పశు వైద్య విద్యార్థులకు వైద్యరంగంలోని విద్యార్థులకు స్టైఫండ్లో అత్యధిక వ్యత్యాసం చూపడం సరికాదని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఇంత తక్కువ స్టైఫండ్ లేదన్నారు. ఫీసులు పెరిగినా స్టైఫండ్ ఇప్పటికీ 7000 మాత్రమే ఉందన్నారు. ప్రతి సంవత్సరం పెరుగుతున్న ఖర్చులు ప్రకారం 10 % అంటే నెలకు 700 పెరగాలి, అదేవిధంగా పెరుగుతున్న ఇన్ ఫ్లేషన్ 7% ప్రకారంగా చూసిన కనీసంగా నెలకు రూ.500 లుగా పెరగాలి. కానీ గత 13 సంవత్సరాలు స్టైఫండ్ పెంచకుండా ఉండటం ఏమాత్రం న్యాయబద్ధం కాదదన్నారు. వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారు సైతం విద్యార్థుల స్టేట్ అండ్ పెంచాలని కూటమి ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పశు వైద్య విద్యార్థుల న్యాయమైన కోరికలను తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య, అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, మోహన్, చంద్రనాయక్, ఓం రాజ్, పులికొండ, విష్ణు, అశోక్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఇది కార్పొరేట్ల భజన బడ్జెట్ :వామపక్షాలు



శ్రీకాళహస్తిలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష నేతలు



గూడూరులో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష నేతలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు, పెత్తందారులకు లాభం చేకూర్చే విధంగా ఉందని, ఏమాత్రం ప్రజారంజకంగా లేదని వామపక్ష నేతలు విమర్శించారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో ఆదివారం సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్, న్యూ డెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, సిపిఐ ప్రాతీయ కార్యదర్శి జనమాల గురవయ్యలు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో మోడీ ప్రభుత్వం ప్రజల మౌలిక అవసరాలకు కేటాయింపులు తగ్గించి, సంపన్నులకు రాయితీలు పెంచి, సామాన్య ప్రజలకు తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. దేశంలో 200 మంది శతకోటీశ్వరులపై నాలుగు శాతం సంపద పన్ను ప్రవేశపెట్టాలని, కార్పోరేట్ పన్ను పెంచాలని, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర హామీ కల్పించాలని, భీమా రంగంలో నూరు శాతం ఎఫ్‌డిఐ ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 50 శాతం నిధులు పెంచాలని, ఆరోగ్యం, విద్యా రంగాలకు జిడిపిలో మూడు శాతం చొప్పున కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఆహార సబ్సిడీని పెంచాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రంగాలకు, మహిళా సంక్షేమానికీ, స్కీం వర్కర్ల గౌరవ వేతనంలో కేంద్రం వాటాను పెంచాలని సూచించారు. ప్రత్యామ్నాయ ప్రతిపాదనలతో పార్లమెంటులో ఫైనాన్స్ బిల్లును ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, దాసరి జనార్ధన్, పెనగడం గురవయ్య, కుమార్, వెలివేంద్రం, సిపిఐ నాయకులు రోడ్డా గోపి, శివకుమార్, న్యూ డెమోక్రసి నాయకులు తాలేటి రామచంద్ర, చందమామల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ, ప్రతిపక్షాలు స్పందించకపోవడం దారుణం : వామ పక్ష నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రవేశపెట్టిన బడ్జెట్ "పేదల బడ్జెట్ కాదని, ఇది కార్పొరేట్ల బడ్జెట్" అని సామాన్య మధ్య తరగతి ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడే విధంగా లేదని సి.పి.ఎం. పార్టీ శాఖ కార్యదర్శి జోగి.శివకుమార్, సి.పి.ఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి.హెచ్.ప్రభాకర్, సి.పి.ఎం. సీనియర్ నాయకులు టి.వెంకటరామిరెడ్డి, సి.పి.ఐ నాయకులు ఎస్.కె.కాలేషాలు విమర్శించారు. తిరుపతి జిల్లా గూడూరు మాయాబజారులోని సి.పి.ఎం పార్టీ కార్యాలయంలో ఆదివారం వామపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం జోగి.శివకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొదటి నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రవేశపెట్టిన బడ్జెట్లో అన్యాయం చేస్తూనే ఉందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్ రెడ్డిలు కూడా ఈ బడ్జెట్‌పై మాట్లాడకపోవడం అత్యంత దారుణమన్నారు. రైతులకు సబ్సిడీలు లేకుండా, పంటకు గిట్టుబాటు ధర లేకుండా 'ఇన్ పుట్' కల్పించకపోవడం దారుణమన్నారు. ఖనిజ సంపద కార్పొరేట్లకు అప్పగించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని అసహనం వ్యక్తం చేశారు. బడ్జెట్లో విద్య, వైద్యంతో పాటు వ్యవసాయ రంగానికి తీరని అన్యాయం చేయడం జరిగిందని, ఉపాధి హామీని నీరుగారుస్తున్నారని మండి పడ్డారు. ఈ బడ్జెట్‌పై కరపత్రాలు వేయించి ప్రజల్లోకి తీసుకెళ్ళి, చైతన్య పరుస్తామని తెలిపారు. ఈ నెల 20వ తేదీన గూడూరు పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం జరుగుతుందని, ప్రజాసంఘాలు, అభిమానులు, సానుభూతి పరులు, ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏకగ్రీవంగా రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్షాలు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఎం.నాయకులు బి.వి. రమణయ్య, ఎస్.సురేష్, పుట్టా శంకరయ్య, పామంజి మణి, బి.చంద్రయ్య, ఆర్.శ్రీనివాసులు గుర్రం రమణయ్య, అడపాల ప్రసాద్, సీ.పి.ఐ.నాయకులు జి.శశికుమార్, ఏంబేటి చంద్రయ్య,రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళను కాపాడిన పోలీసులు



వృద్ధురాలితో మహిళా రక్షక్ పోలీసులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: మన స్థానంగురై ఇల్లు వదలి వచ్చిన మహిళను తిరుపతి మహిళా పోలీసులు కాపాడారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఈస్ట్, వెస్ట్ మహిళా రక్షక్ పోలీస్ సిబ్బంది ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక వృద్ధురాలు ఏడుస్తూ కనిపించింది. ఆమెను విచారించగా తన పేరు రాజేశ్వరమ్మ (72), భర్త వెంకట మునిశెట్టి చనిపోయాడని తెలిపింది. తను ఉండేది తిరుపతి, సుభాష్ నగర్, మూలస్థానమ్మ అమ్మవారి గుడి వద్ద అని తెలిపింది. తన కుమారుడు బెంగళూరులో నివాసం ఉన్నందున, కొంతకాలంగా వృద్ధురాలు కూడా బెంగళూరులోనే ఉండేది. అక్కడ ప్రతిరోజు తన కుమారుడు, కోడలు తనతో గొడవ పడుతున్నారని, అది భరించలేక శివరాత్రి ఉదయం బెంగళూరు నుండి తిరుపతికి వచ్చానని, ఎక్కడికి వెళ్లాలో ఏం చేయాలో తెలియక ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్నానని చెప్పింది. తన కొడుకు, కోడలు వద్ద ఉండలేనని చనిపోవాలనిపిస్తోందని ఏడుస్తూ చెప్పింది. మహిళా రక్షక్ వారు ఆమెకు ధైర్యం చెప్పి తీసుకెళ్లి, శ్రీ పద్మావతి వృద్ధాశ్రమంలో చేర్పించారు. ఆదివారం వృద్ధురాలి కుమార్తె సుజన చిరునామా కనిపెట్టి ఆమెకు అప్పగించారు. ఈస్ట్ అండ్ వెస్ట్ మహిళా రక్షక్ మహిళా పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అభినందించారు.

ప్రయాణికులు ఎక్కడ నిలవాలి?

ఆక్రమణకు గురైన నందనం ప్రయాణికుల నిలయం



ప్రయాణీకుల నిలయంలో వంటచెరకు ఉంచిన దృశ్యం

ప్రజాశక్తి - నాగలాపురం: నాగలాపురం మండలం, నందనం గ్రామానికి చెందిన ప్రయాణికుల నిలయం ఆక్రమణకు గురై ప్రయాణికులు నిలవడానికి నీడలేని పరిస్థితి నెలకొంది. గ్రామస్తుల సమాచారం మేరకు నందనం గ్రామం పుత్తూరు ఊత్తుకోట ప్రధాన రహదారి నుండి సుమారు కిలోమీటర్ దూరంలో నెలకొని ఉంది. దానికి తోడు ఈ పరిధిలో ఎలాంటి నిలువ నీడ లేకపోవడంతో, ప్రధాన రహదారి వద్ద ఏర్పాటుచేసిన ప్రయాణికుల నిలయం ప్రయాణికులకు ఎంతో వసతిగా ఉంటుంది. సర్వేనెంబర్ 253లో సుమారు 20 సెంట్లు విస్తీర్ణంలో ప్రయాణికుల నిలయాన్ని అనేక సంవత్సరాలకు పూర్వమే గ్రామ పెద్దలు ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం ఈ ప్రయాణికుల నిలయం పక్కన కొందరు అంగళ్ళు ఏర్పాటు చేసుకొని, ప్రయాణికుల నిలయాన్ని కూడా ఆక్రమించి వంటచేరుకులతో నింపి వాడుకుంటున్నారు. ప్రయాణికులు కాస్త సేద దీరాలంటే ఇబ్బందిగా ఉందని తెలియచేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణికుల నిలయాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అబాకస్‌లో కుమార్ తేజ ప్రతిభ



విజేతను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం, నారాయణపురం పంచాయతీ విశాలాక్షినగర్‌కు చెందిన చలపతి కుమారుడు పి.కుమార్ తేజ అబాకస్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరచి మొదటి బహుమతి సాధించాడు. గత నెల 26న చెన్నైలో జాతీయ స్థాయి అబాకస్ పోటీలు నిర్వహించారు. శ్రీకాళహస్తి, నారాయణ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కుమార్ తేజ ఈ పోటీల్లో పాల్గొని మొదటి లెవెల్ లో ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నాడు. అబాకస్ పోటీల ఫలితాలు ఆదివారం వెలువడటంతో కుమార్ తేజను విద్యా సంస్థ నిర్వాహకులు అభినందించారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్



తనిఖీలు నిర్వహిస్తున్న డిఎస్పీ గీతా కుమారి, సిబ్బంది

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నేరాలను నియంత్రించేందుకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు గూడూరు డిఎస్పీ గీతా కుమారి పేర్కొన్నారు. గూడూరు రెండో పట్టణంలోని దండోరా కాలనీలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేశారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానిక ప్రజలకు సూచించారు. ఈ తనిఖీల్లో రెండో పట్టణ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు మనోజ్ కుమార్, తిరుపతయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ



దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు ఇస్తున్న జెవివి సభ్యులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల భవనములో జే.వి.వి. సభ్యులు సుబ్బారావు ఆనంద్ దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొండగుంట హెడ్మాస్టర్ కోటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక వారు మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేయడమేకాక, సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జే.వి.వి. అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, సుబ్బారావు, ఆనంద్, నాగ రాజు, చెంచు నారాయణ, పురుషోత్తమరావు, ఇబ్రహీం, రజిని కాంత్, సుమన్ రెడ్డి, సురేష్, మాముడూరు రాధయ్య, విశ్రాంత ఉద్యోగి పురుషోత్తమరావు, జానా సుధీర్‌లు పాల్గొన్నారు.

సామాన్య భక్తులకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - నాగలాపురం: నాగలాపురం మండలం, సురుటుపల్లి శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయం మహాశివ రాత్రి సందర్భంగా దర్శనాల్లో సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తామని ఆలయ కార్య నిర్వహణఅధికారి లత ఆదివారం తెలిపారు.

అభివృద్ధికి నోచుకోని పుత్తూరు రైల్వే స్టేషన్

■ రైలు వచ్చేదాకా చెట్లకిందే.. ■ దివ్యాంగుల మరుగుదొడ్లకు తాళాలు ■ మహిళలకు మౌలిక వసతులు మరచిన వైనం ■ అభివృద్ధిచేయాలని స్థానికులు డిమాండ్

దక్షిణ రైల్వే పరిధిలోని పుత్తూరు రైల్వేస్టేషన్ వసతుల లేమితో బోరుమంటోంది. నగరి మండలం వెంకటనరసింహరాజు పేట నుంచి పూడి వరకు దక్షిణ రైల్వే పరిధిలో ఉంది. ఈ రైల్వే స్టేషన్ల అభివృద్ధిపై అధికారులు సవతి ప్రేమను చూపుతున్నారనే విమర్శలున్నాయి.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు రైల్వే స్టేషన్ నుంచి నిత్యం వస్త్ర వ్యాపారులు చెన్నై, హైదరాబాదు, ముంబయి వంటి ఇతర ప్రాంతాలకు సగటున 150-200 మంది వెళ్తుంటారు. రైల్వేకు రూ.1.20 కోట్లు నుంచి రూ.1.50 కోట్లు వరకు ఆదాయం వస్తుంది.ఇంత ఆదాయం సమకూరుతున్నా అసౌకర్యాల నడుమ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో దక్షిణ రైల్వే అధికారులు తనిఖీ చేసిన సమయంలో పుత్తూరు రైల్వే స్టేషన్‌ను ఆదర్శ రైల్వేస్టేషన్‌గా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.అవి నేటికీ కార్యరూపం దాల్చలేదు. చెన్నై నుంచి తిరుత్తణి వరకు యూనిట్ రైళ్లు వస్తున్నాయి. వాటిని రేణిగుంట వరకు పొడగించాలని పలుమార్లు ప్రజలు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నా సంబంధిత అధికారులు పెడచెవిన పెడుతున్నారు. యూనిట్ రైళ్ల రేణిగుంట వరకు పొడిగిస్తే ప్రయాణికులకు సౌలభ్యంగా ఉంటుంది. ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



ఎండైనా.. వానొచ్చినా..
చెట్ల కిందే రైలుకోసం ఎదురుచూపులు



మరుగుదొడ్లకు తాళాలు వేసిన దృశ్యం

ఇవీ సమస్యలు

పుత్తూరు రైల్వే స్టేషన్లో ముంబయి, చెన్నై, హైదరాబాద్, తిరుపతి వంటి ప్రాంతాలకు వెళ్లే ఎక్స్ ప్రెస్ రైళ్లు ఆగుతుంటాయి. ఒక్క దురంతో ఎక్స్ ప్రెస్ మాత్రం ఆగడం లేదు. రైల్వే బోగీల డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేశారు. కానీ అవి పనిచేయడం లేదు. వృద్ధులు, చిన్న పిల్లలతో ప్రయాణాలు చేసే మహిళలకు లిఫ్ట్‌వంటి సౌకర్యాలులేవు. ఇటీవల స్టేషన్‌లో మరుగుదొడ్లను నిర్మించి వాటికి తాళం వేశారు. వికలాంగులకు ద్విచక్రవాహనాలు లేవు. వివిధ ప్రాంతాల నుంచి శల్య వైద్యం కోసం పుత్తూరుకు కాళ్లు, చేతులు విరిగిన వారు విచ్చేస్తుంటారు. వారు కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం పూర్తి స్థాయిలో షెల్టర్లు కూడా లేవు. దీంతో చెట్ల కింద ప్రయాణికులు వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించి, వసతులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మంత్రిని కలిసిన పశువైద్య విద్యార్థులు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, తిరుపతి విద్యార్థుల నిరవధిక సమ్మె ఆదివారం 14వ రోజు, రిలే నిరాహార దీక్ష 10వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా 300 మంది విద్యార్థులు, ఎలైట్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్, టీడీపీ అధికార రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం మద్దతుతో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని తిరుపతి విమానాశ్రయంలో కలిసి, తమ స్టైపెండ్ పెంపు కోసం వినతి పత్రం ఇచ్చారు. స్పందించిన లోకేష్ పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చం నాయుడుతో ఈ అంశాన్ని చర్చించి, పరిష్కారం తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ (మా) నూతన కార్యవర్గం ఎన్నిక

శాశ్వత గౌరవ అధ్యక్షుడిగా డా.పాకనాటి హరికృష్ణ

ప్రజాశక్తి - క్యాంపస్ : అంతర్జాతీయ, భారత ఒలంపిక్ అసోసియేషన్ గుర్తింపు గల భారత మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ (మా) నూతన కార్యవర్గాన్ని తిరుపతి, యూత్ హాస్టల్‌లో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గానికి శాశ్వత గౌరవ అధ్యక్షుడిగా డా.పాకనాటి హరికృష్ణ, నూతన అధ్యక్షురాలిగా ఎల్.సుశీలమ్మ, కార్యదర్శిగా అవుకు రమణ, కోశాధికారిగా ఎం దీపిక లు ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్టు తాజా మాజీ అధ్యక్షుడు, టిటిడి డిఈ జి.నారాయణప్ప ప్రకటించారు.

వధూవరులకు ఎమ్మెల్యే దీవెనలు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం, ఎస్.ఎస్.బి పేట తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత సర్పంచ్ మనోహర్ కుమారుని వివాహం తిరువళ్ళూరులో ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ వివాహ వేడుకలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరై వధూవరులను ఆశీర్వదించారు.


ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు


ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, కేబీఆర్ పురంలో ఆదివారం తిరుపతి ఐకాన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో సూపర్ స్పెషాలిటీ, జనరల్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ వంటి ఆధునిక వైద్యంపై ప్లాస్టిక్ సర్జరీ వైద్యనిపుణులు డాక్టర్ కె.మురళీకృష్ణ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పుట్టుకతో వచ్చే కొన్ని సమస్యలు, ప్రమాదాల ద్వారా వచ్చే ఆరోగ్య సమస్యలకు జనరల్, ప్లాస్టిక్ సర్జరీల ద్వారా మెరుగైన వైద్యసేవలు పొందే అవకాశం ఉందన్నారు. ఈ వైద్య శిబిరంలో దంతవైద్యురాలు డాక్టర్ జి.దేవి దంత సమస్యలతో వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ వైద్యసేవ వర్తించే వ్యాధులకు ఆపరేషన్లు చేసి నయం చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో కేబీఆర్ పురం గ్రామపెద్దలు, తిరుమలకుప్పం, రామసముద్రం, క్రిష్ణసముద్రం గ్రామపంచాయతీల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు మాజీ ఎమ్మెల్సీ దంపతులకు ఆహ్వానం



ప్రజాశక్తి - పిచ్చాటూరు: నాగలాపురం మండలం, సురుటపల్లి శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో జరుగు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్ర నాయుడు దంపతులకు ఆలయ అర్చకులు ఆహ్వానం అందించారు. ప్రతి ఏటా శివరాత్రి ఉత్సవాలకు జయచంద్ర నాయుడు కుటుంబం ఉభయదారుగా వ్యవహరిస్తారని అర్చకులు తెలియజేశారు.

కావునాడు అధ్యక్షుడు బాలకు ఎమ్మెల్యే ఆదిమూలం సన్మానం



అధ్యక్షుడు బాలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చా టూరు: సత్యవేడు నియోజకవర్గం కావునాడు అధ్యక్షుడు బాల, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను ఆదివారం పిచ్చాటూరు టీడీపీ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, క్లస్టర్ ఇంచార్జి డి.ఇళంగోవన్ రెడ్డి, కావునాడు రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనువాసులు బాలను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ విజయంలో బాల కీలకపాత్ర పోషించారున్నారు. కావు సామాజిక వర్గంవారి అభివృద్ధికి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అరణీయర్ ఆయకట్టు చైర్మన్ రవి, టీడీపీ సీనియర్ నాయకులు పద్దురాజు, బుజ్జినాయుడు, శివకృష్ణమ నాయుడు, ఢిల్లీ, రజని, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్నేక్ రెస్క్యూర్ శిక్షణ కార్యక్రమం



శిక్షణ పొందిన వారికి సర్టిఫికేట్లు అందిస్తున్న సెల్వం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శన శాలలో రెండు రోజులపాటు జరిగిన స్నేక్ రెస్క్యూర్ శిక్షణ కార్యక్రమం ఆదివారం మధ్యాహ్నంతో ముగిసింది. మద్రాస్ క్రొకోడైల్ బ్యాంక్ ట్రస్ట్, సంఘమిత్ర ఎనిమల్ ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శనశాల వేదికగా ఈ ట్రైనింగ్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో విష సర్పాలు, విషం లేని సర్పాల పట్ల ఎలా నడుచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల నుండి దాదాపు 50 మంది శిక్షణ కోసం వచ్చారని జూ పార్క్ క్యూరేటర్ సెల్వం తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వారికి క్యూరేటర్ సెల్వం సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో జూ పార్కు ఏసిఎఫ్ నాగభూషణం, అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్, మద్రాసు క్రొకోడైల్ బ్యాంక్ ట్రస్ట్ ప్రాజెక్టు లీడ్ పర్సన్ జ్ఞానేశ్వర్, సంఘమిత్ర అనిమల్ ఫౌండేషన్ నిర్వాహకులు మహమ్మద్ ఐద్రీస్, జూ పార్క్ సిబ్బంది పాల్గొన్నారు.

దంత సమస్యలపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వాకర్స్ సభ్యులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: స్థానిక కేశవాయన గుంటలోని గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో అధ్యక్షులు రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కార్యదర్శి తోట చక్రపాణి, ముఖ్యఅతిథిగా హరిప్రియ దంత వైద్యశాల అధినేత గణేష్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో అధ్యక్షులు రఘురామి రెడ్డి సంఘ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యక్రమాలు, వాకర్ సభ్యుల మెంబర్షిప్ డ్రైవ్ ఇతర విషయాలపై చర్చించారు. దంత వైద్యులు గణేష్ కుమార్ రెడ్డి సభ్యులకు దంత సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం గత సంవత్సరం వాకర్ సంఘ అధ్యక్షులుగా పనిచేసిన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రెడ్డి వారి ప్రభాకర్ రెడ్డిని, మాయ బజార్ భాస్కర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.ఎస్.ఆర్ ఆంజనేయులు, విజయ భాస్కర్ రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, ఏ.గోపి యాదవ్, బండి మధుసూదన రెడ్డి, విశ్రాంత డిఎస్పీలు పి.శంకర్, కిషోర్, విశ్రాంత టీటీడీ డీఈఓ నాగరాజ, విశ్రాంత ఏఈఓ రఘురాంరెడ్డి, పటాల బాబు, షాబుద్దీన్, ప్రసాద్, గాదే సుబ్రహ్మణ్యం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో సూచనలిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో కిమ్స్ (బొల్లినేని) హాస్పిటల్, కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగరాజు వాకర్స్‌కు ఆదివారం గుండె జబ్బులపై అవగాహన కల్పించారు. గుండె నొప్పి వచ్చినపుడు చాతిపై సీపీఆర్ చేసే విధానం డెమోద్వారా చూపించారు. గుండె జబ్బుపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రమణయ్య , కే.వి.హాస్పిటల్ డాక్టర్ త్రివిక్రమ్ , డాక్టర్ ప్రకాష్ , వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేగూరు రాజేంద్రప్రసాద్, వసంత్, శర్మ, నిమ్మకాయల రవి, సేగు వెంకటేశ్వర్లు, భాషా, బొడ్డు కృష్ణయ్య , సురేష్, ఈతముక్కల రమణయ్య, రాజేంద్ర, రిటైర్డ్ ఆర్.ఐ దాసు, వాకర్స్ ,తదితరులు పాల్గొన్నారు

విశ్వ గురువుగా భారతదేశం

ఎస్వీయూలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు



ప్రజాశక్తి - క్యాంపస్ : విశ్వ గురువుగా అభివృద్ధి చెందుతున్న భారతదేశం చూసి ప్రతి ఒక్కరూ గర్వించాలని వక్తలు పేర్కొన్నారు. ఎస్వీయూలో మూడు రోజుల పాటు రాజనీతి శాస్త్ర, ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం, పూర్వ విద్యార్థుల సంయుక్త ఆధ్వర్యంలో ఆచార్య బివి. మురళీధర్ అధ్యక్షతన" విశ్వశక్తిగా అభివృద్ధి చెందుతున్న భారతదేశం: వికసిత్ భారత్ ఏ2024 వైపు ప్రయాణం" అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు ముగింపు సమావేశం శ్రీనివాస ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య వక్తగా విచ్చేసిన ప్రొఫెసర్ జి. కుప్పురం, మసిండే ములిరో శాస్త్ర సాంకేతిక విశ్వవిద్యాలయం, కకమెగా, కెన్యా, మాట్లాడుతూ భారతదేశ యువత, వివిధ విభాగాల సిబ్బంది శ్రద్ధతో కృషి చేస్తే వికసిత్ భారత్ ఆవిర్భావం సాధ్యమేనన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, రిజిస్ట్రార్ఆచార్య డిఎమ్. మమత, మాట్లాడుతూ దేశం వికసిత్ భారత్ వైపు పరివర్తన చెందడానికి శాస్త్ర సాంకేతికత ఉత్ప్రేరకంగా ఉంటుందన్నారు. ఆన్ లైన్‌లో మరో ప్రత్యేక అతిథి యుఎస్ఏ నుంచి శామ్యూల్ డడాల మాట్లాడుతూ కృత్రిమ మేథ, డిజిటల్ పరివర్తనతో ఆరోగ్యం, విద్య, వైద్య, రంగానికి అనుసంధానం చేసి మెరుగుపరచవచ్చని అన్నారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ నైపుణ్యాలను మెరుగుపరచుకోడం ద్వారా వికసిత్ భారత్ సాధ్యమన్నారు.ఈ కార్యక్రమంలో డా. సిఎల్. చెన్నా రెడ్డి, డా. ఐ. ఎస్. కిషోర్, డా. శ్రీరాములు, డా. వెంకటేశులు రెడ్డి, డా. మల్లిఖార్జున, ప్రతినిధులు, విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి విలేకరుపై దాడి హేయం : వలిగలం గోపి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : పార్వతీపురం మన్యం, మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై ఆ మండల టిడిపి అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ నాయుడు దాడి చేసిన విషయాన్ని ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వలిగలం గోపి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఉదయం ఏ- వెంకంపేట నుండి కాశీపట్నం వెళ్లే నూతన రహదారి వద్ద వేణుగోపాల్ నాయుడిని కలవడానికి వెళ్లిన విలేకరి రామారావుపై టిడిపి నేత బూతులు తిట్టడమే కాకుండా, చేయి చేసుకోవడం దారుణమన్నారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తున్న విలేకరులపై ఇలా రాజకీయ నాయకులు దాడి చేయడం సరైనది కాదన్నారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

అంగన్వాడీల ధర్నా జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఐ.సి.డి.ఎస్. కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు వర్కర్లు దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలపై 17వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ధర్నా నిర్వహిస్తున్నామని అంగన్వాడీ, సీ.ఐ.టీ.యు నాయకులు ప్రభావతి, ఇంద్రావతిలు తెలిపారు. గూడూరు మండలాల అంగన్వాడి వర్కర్స్, మినీ వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై చర్చలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలంలోని అభివృద్ధికి నోచుకోని పంచాయతీలపై నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, మండల అభివృద్ధి అధికారి రమేష్ బాబు, మాజీ ఎంపీపీ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్యలు ఆదివారం ఎమ్మెల్యే గృహంలో చర్చించారు. ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వాటికి కావలసిన నిధులు మంజూరు చేసేందుకు నివేదిక అందిస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు.

ఘనంగా శ్రీ కృష్ణ దేవరాయల జయంతి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక రాజ గోపురం వద్ద శ్రీకృష్ణదేవరాయల 554వ జయంతిని రాధా, రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ శ్రీ కృష్ణదేవరాయలు చూపిన తెగువ, పాలనా దక్షత ఆదర్శనీయన్నారు. ఈ కార్యక్రమంలో రాధా రంగా మిత్రమండలి నియోజకవర్గ అధ్యక్షులు సిద్దులు గారి ప్రసాద్, జనసేన నాయకులు శివ కుమార్, తోట గణేష్‌లు పాల్గొన్నారు.

ఫల సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ రోహిణి, డాక్టర్ జనార్ధన్ రెడ్డిలు ఫల సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండి ధనంజయ రెడ్డి దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జైపాల్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, కిషోర్ రెడ్డి, ప్రజేంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాళ్వ చారుమతికి డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ఫార్మసీ విభాగం పరిశోధక విద్యార్థిని సాళ్వ చారుమతికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల డీన్ ఆచార్య జీవన జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ విభాగం ఆచార్యులు ప్రొఫెసర్ జి.రజిత పర్యవేక్షణలో "మెథడ్ డెవలప్మెంట్ అండ్ వాలిడేషన్ ఫర్ ఎస్టిమేషన్ అఫ్ సెలెక్టెడ్ డ్రగ్స్ ఇన్ బల్క్ అండ్ ఫార్మాస్యూటికల్ డోసేజ్ ఫార్మ్ బై లిక్విడ్ క్రోమాటోగ్రఫీ టెక్నిక్స్" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

న్యాయశాస్త్రంలో పరిమి లక్ష్మికి డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం న్యాయ శాస్త్ర విభాగపు పరిశోధక విద్యార్థిని పరిమి లక్ష్మికి డాక్టరేట్ ఇచ్చినట్లు పరీక్షల డీన్ ఆచార్య బి. జీవన జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయ శాస్త్ర విభాగపు ఆచార్యులు ప్రొఫెసర్ డా.ఎన్.బి.చంద్రకళ పర్యవేక్షణలో " నేచర్ అండ్ స్కోప్ ఆఫ్ ట్రెడిషనల్ నాలెడ్జ్ పేటెంటింగ్ ఇన్ ఇండియా విత్ స్పెషల్ రిఫరెన్స్ టు ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ - ఏన్ అనాలసిస్" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు.

మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో శ్రీదేవికి డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం పరిశోధక విద్యార్థిని సదిపిరాల్ల శ్రీదేవికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల డీన్ ఆచార్య జీవన జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆచార్య జె. కాత్యాయని మార్గదర్శకత్వంలో "రాయలసీమ ప్రాంతంలోని సేంద్రీయ ఆహార పదార్థాలను కొనుగోలు చేసే వినియోగదారుల ప్రవర్తనపై అధ్యయనం" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు.

ఎమరాల్డ్స్‌లో ఘనంగా ఈక్వెస్ట్-25 వేడుకలు

అచీవర్ ఆఫ్ ది ఇయర్‌గా ' పూజశ్రీ '



విద్యార్థి పూజశ్రీకి బహుమతి అందిస్తున్న
కళాశాల డైరెక్టర్ గిరిధర్, అసిస్టెంట్ డైరెక్టర్ మునిరత్నం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి, నరసింహ తీర్థం రోడ్డు మార్గంలో గల ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో ఈక్వెస్ట్-25 కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఈక్వెస్ట్ 25 పేరిట బిజినెస్ క్విజ్, యాడ్ గేమ్, బిజినెస్ ప్రపోజల్, స్పార్క్, స్టాక్ బజ్ విభాగాలలో పోటీలను నిర్వహించమని నిర్వాహకులు తెలిపారు. ఇందులో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ పాటవాలను ప్రదర్శించారని కళాశాల సంచాలకులు గిరిధర్, విశ్వనాథ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సంచాలకులు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు తరగతి గదులలో సృజనాత్మకతను అందిపుచ్చుకుని ఇటువంటి కార్యక్రమాలలో రాణిస్తూ, ఉన్నతంగా స్థిరపడాలని ఆకాంక్షిస్తున్నామ న్నారు. కళాశాల ఉపసంచాలకులు ఎం.మునిరత్నం విజేతల వివరాలను ప్రకటించారు. ఇందులో యాడ్మ్ విభాగంలో ప్రథమ స్థానంలో బి.వెంకటసాయి, ఎం. విజయ్, ఎస్. గుహన్, రెండవ స్థానంలో యష్వంత్, శరవణ, జశ్వంత్, మోహన్, స్టాక్ గేమ్ విభాగంలో ప్రథమ స్థానంలో హర్షిత, చిన్మయిశ్రీజ, రెండవ స్థానంలో జయదుర్గ ప్రసాద్, శరవణగుహన్, స్పార్క్ వివిభాగంలో ప్రథమ స్థానంలో సన ఫాతిమ, రెండవ స్థానంలో సాయి కీర్తన, బిజినెస్ ప్రపోజల్ విభాగంలో శ్రీకాంత్, దీపిక చౌదరి , రెండవ స్థానంలో ఝాన్సీ ప్రియ, పూజశ్రీ, క్విజ్ విభాగంలో ప్రథమ స్థానంలో జి. జశ్వంత్, నవనీత్ రెండవ స్థానంలో కె.జయదుర్గ ప్రసాద్, తేజసాయి గెలుపొందారున్నారు. అచీవర్ ఆఫ్ ది ఇయర్ గా పూజశ్రీ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జాఫర్ వల్లి, భాను కిరణ్, భాగ్యలక్ష్మి, వినీల, వసుందర, డాక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

యువత కలలు కనాలి : గల్లా జయదేవ్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: వర్షా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ బిజినెస్ డెవలప్మెంట్ అండ్ ఆపరేషన్స్ డైరెక్టర్ కస్తూరి వర్షా విశ్వనాథ్ 2025 సంవత్సరానికి చైర్ పర్సన్‌గా నియమితులయ్యారు. మిస్టర్ డి నితిన్ కో-చైర్మన్‌గా నియమితులయ్యారు. అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జయదేవ్ గల్లా ఆదివారం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని యువతను కలలు కనాలని కోరారు. సీఐఐ తిరుపతి చైర్మన్ పుష్పిత్ గార్గ్ మాట్లాడుతూ సీఐఐ, వైల మధ్య భవిష్యత్తులో సహకారానికి అనేక అవకాశాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్ రాథోడ్, నేషనల్ వైస్ చైర్మన్, యంగ్ ఇండియన్స్ - డాక్టర్ రమాదేవి గౌరినేని, చైర్పర్సన్, సీఐఐ ఇండియన్ ఉమెన్ నెట్వర్క్, ఆంధ్రప్రదేశ్ చాప్టర్ యంగ్ ఇండియన్స్ రీజినల్ చైర్ ఆనంద్ దాగా, చాప్టర్ లాంచ్ ఛాంపియన్ - సౌత్, యంగ్ ఇండియన్స్ ప్రణవ్ జోషి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వర్సిటీ జీతాలపై మంత్రిని కలిసిన విసీ, రిజిస్ట్రార్

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వి యూనివర్సిటీ జనవరి జీతాలు, పెన్షన్లు ఇప్పటివరకు రాకపోవడంతో తిరుపతి పర్యటనకు వచ్చేసిన మంత్రి నారా లోకేష్ బాబును ఎయిర్పోర్ట్‌లో వర్సిటీ ఇంచార్జీ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడులు కలిసి జీతాలు మంజూరు చేయాలని వినతిపత్రం ఇచ్చారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ఫైనాన్స్ సెక్రటరీలో మాట్లాడి జీతాలకు పెన్షన్లకు అవసరమయ్యే నిధులను మంజూరు చేయిస్తానని తెలిపారు.